## క్లుప్తంగా

### ట్రాన్స్‌జెండర్స్ హక్కులపై అవగాహన



గుంటూరు లీగల్: క్యాలెండర్ అక్టివిటీలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శుక్రవారం ట్రాన్స్‌జెండర్స్‌కి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి. చంద్రమౌళీశ్వరి లింగమార్పిడి హక్కుల రక్షణ చట్టం 2019పై వారికి అవగాహన కల్పించారు. ఈ చట్టం ప్రకారం ట్రాన్స్‌జెండర్స్ గుర్తింపు కార్డులు పొందవచ్చని చెప్పారు. ట్రాన్స్‌జెండర్స్ చేత బలవంతంగా పనిచేయించడం నేరమన్నారు. ఇంట్లో నుంచి లేదా గ్రామంలో నుంచి బహిష్కరించినా, వారిపై దాడులు చేసినా చట్టరీత్యా నేరమని తెలియజేశారు. కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్ కాళిదాస్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ అధికారి వాసంతి, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఎల్.ముధుసూదన్‌రావు, పాల్గొన్నారు.

### రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

నెహ్రూనగర్: స్థానిక రైలుపేట పరిధిలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తాగునీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ప్రకటనలో తెలియజేశారు. నగరంలో మెరుగైన తాగునీటి సరఫరా జరిగేలా, ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా సంగం జాగర్లమూడి నుండి నగరానికి తాగునీరు సరఫరా జరిగే 300 ఎంఎం డయా ఎసి పైప్ లైన్ పై వెంకటాద్రిపేట వద్ద ఏర్పడిన లీకు మరమత్తు పనుల వలన నిలిచి పోతుందన్నారు. సాయంత్రం నుండి యధావిధిగా సరఫరా జరుగుతుందని తెలిపారు.

### నేడు జీజీహెచ్‌లో డాక్టర్స్ డే

గుంటూరు మెడికల్: గుంటూరుజీజీహెచ్‌లో శనివారం డాక్టర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆసుపత్రిలోని శుశ్రుత హాలులో డాక్టర్స్ డే వేడుకలు జరుగుతాయన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు రక్తదానం చేస్తున్నారని, పలువురు సీనియర్ వైద్యులను ఘనంగా సన్మానిస్తున్నామన్నారు. వేడుకలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారన్నారు.

### 9న ఉపాధ్యాయుల సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఈనెల 9న గుంటూరులో ఉపాధ్యాయుల సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ ఎం. కళాధర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్లో జరిగిన ఫ్యాప్టో భాగస్వామ్యపక్ష నాయకుల సమావేశంలో కళాధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ విద్యారంగ పరిరక్షణ కోసం ఏర్పాటు చేస్తున్న సదస్సులో వివిధ అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు. ఫ్యాప్టో కార్యవర్గ సభ్యుడు కె. బసవ లింగారావు మాట్లాడుతూ పీఆర్‌సీ కమిటీని తక్షణమే నియమించి, బకాయిలను విడుదల చేయాలని కోరారు. సమావేశంలో ఫ్యాప్టో పల్నాడు జిల్లా ఛైర్మన్ సంపత్‌బాబు, డి. పెదబాబు, నాయకులు జి. వేళాంగిణిరాజు, ఎండీ ఖాలీద్, ఎం. శ్రీనివాసరావు, సీహెచ్ ఆదినారాయణ, వి. ప్రసాద్, కె. శ్రీనివాసరావు. జి. వెంకటేశ్వరరావు, ఎం. గురుబ్రహ్మం పాల్గొన్నారు.

### భర్తపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: భార్యను కేసు విత్‌డ్రా చేసుకోని భర్త బెదిరించిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శివరామ్‌నగర్‌కు చెందిన ఎస్.గీతిక కన్నావారితోట ఐదోలైనులో తన భర్త అమృతలూరి వెంకటేశ్వరరావు కార్యాలయానికి వెళ్లింది. వెంకటేశ్వరరావు తనపై పెట్టిన కేసు విత్‌డ్రా చేసుకోవాలని భార్య గీతకను దుర్భాషలాడి బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కులం పేరుతో దూషించినందుకు...

గుంటూరు ఈస్ట్: మహిళ కులంపేరుతో వ్యక్తిని దూషించిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివరామ్‌నగర్‌లో నివసించే కొప్పుల నాగేశ్వరరావుకు, ఎస్.గీతకకు పాత కక్షలు ఉన్నాయి. ఈనేపథ్యంలో జూన్ 29న ఇరువురు గొడపడ్డారు. కొరివి విజయ్‌కుమార్ అనే వ్యక్తి నాగేశ్వరరావు తరుపున మాట్లాడుతూ గీతికను వారించాడు. విజయ్‌కుమార్‌ను గీతిక కులం పేరుతో దూషించింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అసోసియేషన్ కౌన్సిల్ ఎన్నిక

గుంటూరు ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కౌన్సిల్ ఎన్నికలు శుక్రవారం ద్వారాకా తిరుమలలో జరిగినట్లు గుంటూరు జిల్లా అధ్యక్షుడు కైలాస్ నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో జిల్లాకు చెందిన పరమేశ్వరరెడ్డి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా, ఏఎంజీ ఉమామహేశ్వరరావు అసోసియేట్ అధ్యక్షుడిగా, యూవీవీ సాగర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. గుంటూరు జిల్లా శాఖ కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపినట్లు వెల్లడించారు.

# నేటి నుంచి జగనన్న సురక్ష ప్రారంభం

- పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్
- జగనన్న 95 శాతం పైగా హామీలు అమలు చేశారు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

నగరంపాలెం: రాష్ట్ర ప్రభుత్వం శనివారం నుంచి 30 తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని గుంటూరు–2 ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఒక్కొక్క రోజు ఒక్కొక్క సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష ప్రారంభం కానుందని వివరించారు. అర్హులైన ప్రజలకు ప్రభుత్వ సేవలతోపాటు సంక్షేమ పథకాలను త్వరితగతిన పంపిణీ చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక, గత ఎన్నికల్లో యిచ్చిన హామీలలో 95 శాతం పైగా హామీలను పారదర్శకంగా అమలు చేసిన విషయం అందరికీ తెలుసునన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలకు కొనసాగింపుతోపాటు, రాష్ట్రంలో మిగిలిన ఒక శాతం మంది ప్రజల్లో కూడా ఇంకా ఎవరైనా లబ్ధిదారులు ఉన్నట్లయితే వారికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందించన్నట్లు తెలిపారు. గతంలో చేపట్టిన గడప గడపకు కార్యక్రమం ద్వారా స్థానికులు తెలియజేసిన ప్రతి సమస్యను పరిష్కరించినట్లు ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 2.6 లక్షల గ్రామ, వార్డు వలంటీర్లు, 1.5 లక్షల సచివాలయ సిబ్బంది, 3 వేల మంది మండల స్థాయి అధికారులు, కేవలం 30 రోజుల వ్యవధిలోనే సచివాలయాలు యూనిట్‌గా 15 వేల జగనన్న సురక్ష క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తద్వారా 1.6 కోట్ల కుటుంబాలకు అవసరమైన ప్రభుత్వ సేవలు అందించనున్నారని పేర్కొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో రాష్ట్రంలోని ప్రతి వలంటీర్, గృహ సారథి, సచివాలయ, మండలం స్థాయి అధికారులు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారని తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు అపైన సీఎం జగన్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలు, సేవలు పొందవచ్చునని అన్నారు. అవసరమైన వారికి కులం, ఆదాయం, జనన, మరణ, వివాహ, కుటుంబ ధృవీకరణ పత్రాలు, భూహక్కు పత్రాలు, ఆధార్ కార్డులకు మొబైల్ నంబర్ల అనుసంధానిస్తానని పేర్కొన్నారు. అంతేగాక పంట సాగు, రేషన్ కార్డు లేదా రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో మార్పులు చేర్పులు తదితర ధ్రువీకరణ పత్రాలను జగనన్న సురక్ష పథకం ద్వారా ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్లు షేక్.రోషన్ (29వ డివిజన్), అచ్చాల వెంకటరెడ్డి (30వ డివిజన్), అందుగుల సంతోష్ (31వ డివిజన్) పాల్గొన్నారు.

## జగనన్న సురక్షను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: నేటి నుంచి జరిగే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్షా పథకం లక్ష్యం దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని సూచించారు. ముఖ్యంగా సీఎంగా వై.ఎస్.జగన్ బాధ్యతలు చేపట్టిన తరువాత 99 శాతం హామీలను అమలు చేశారన్నారు. ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తారని, సంక్షేమాన్ని ప్రజల దరి చేర్చడంతోపాటు, అభివృద్ధికి పెద్ద పీట వేస్తారని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లోని వలంటీర్లు, గృహసారథి, సచివాలయం అధికారులు, మండల, జిల్లాస్థాయి అధికారులతోపాటు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని మానిటరింగ్ చేస్తారని తెలిపారు. జగనన్న సురక్షలో భాగంగా అందే ప్రభుత్వ పథకాలు, సేవలు సద్వినియోగం చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ వలంటీరు వారి సేవలు అందిస్తారని తెలిపారు. జులై 1న నియోజకవర్గ పరిధిలోని పాతగుంటూరు మణి హోటల్ సెంటర్, ఆంజనేయస్వామి ఆలయం వద్ద, ఆయా సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష ప్రారంభమవుతోందని తెలిపారు.

## సమన్వయంతో పనిచేస్తేనే సమస్యల పరిష్కారం

- ప్రజా ప్రతినిధుల అర్జీలు విభాగాధిపతులే పరిష్కరించాలి
- నగర కమిషనర్ కీర్తి చేకూరి



కార్పొరేటర్లతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి

నెహ్రూనగర్: ప్రజా ప్రతినిధుల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలను సంబంధిత విభాగాధిపతులే ప్రత్యక్షంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో నగరంలోని కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులు ప్రజలతో మమేకమై ఉంటారని, వారు గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం స్పందన, ప్రతిరోజు వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజా స్పందన నిర్వహిస్తున్నామన్నారు. వార్డుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనుల పై కార్పొరేటర్లు కూడా కమిషనర్‌తో చర్చించడానికి ప్రత్యేక సమయం కావాలని కోరి ఉన్నందున ప్రతి శుక్రవారం కార్పొరేటర్లు తమ వార్డుకు సంబంధించిన అంశాలు చర్చించేందుకు అవకాశం ఉందన్నారు.

### ఈ–ఆటోలతో నూరుశాతం చెత్త సేకరణ

పాత గుంటూరు: నగరంలో సచివాలయాల పరిధిలోకి వచ్చిన ఈ-ఆటోల ద్వారా నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాలని, క్లస్టర్, హోం కంపోస్ట్ తయారీకి కార్యదర్శులు ప్రజల్లో అవగాహన కలిగించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. శుక్రవారం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఇంజనీరింగ్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటి నుండి వ్యర్థాలను తడిపొడిగా విభజన చేసే తీసుకోవాలన్నారు. 2023 స్వచ్ఛ సర్వేక్షణ్ లో గుంటూరు మెరుగైన ర్యాంక్ సాధించేలా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు.

## పక్కాగా అవుట్ ఫాల్ డ్రెయిన్ల నిర్వహణ ఉండాలి

- మేయర్ మనోహర్ నాయుడు ఆదేశం
- 45వ డివిజన్‌లో పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ మనోహర్ నాయుడు

నెహ్రూనగర్: వర్షా కాలంలో గుంటూరు నగరంలో అవుట్ ఫాల్ డ్రెయిన్‌ల నిర్వహణ పక్కాగా ఉండాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. శుక్రవారం నగరంలోని 45వ డివిజన్‌లో పర్యటించి, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, సదరు సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తొలుత కొరిటెపాడు వాకింగ్ ట్రాక్, గౌతమి నగర్ ప్రాంతాల్లో పర్యటించి, సదరు ప్రాంతాలలో తాగునీటి సమస్య, పారిశుధ్య పరమైన సమస్యలను ప్రజలు అడిగి తెలుసుకున్నారు. తమ ప్రాంతంలో తాగునీటి సరఫరాలో సమస్యలేమీ లేవని, గౌతమి నగర్ 5వ లైన్‌లో అవుట్ ఫాల్ డ్రెయిన్ సమస్య ఉందని, మురుగు నీటి పారుదల లేక గృహాల వద్దనే మురుగునీరు ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. గుంటూరు నగరంలోని ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయిన్లలో సిల్ట్ ను ఎప్పటికప్పుడు అధికారులు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యక్కలూరి మారుతి, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల్లో నాణ్యత ఉండాలి

నెహ్రూనగర్: నగరాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు పాలక వర్గం ప్రతిపాదించిన అభివృద్ధి పనులు నిర్వహించుటకు టెండర్ పొందిన కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువు, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. శుక్రవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరంలో పురోగతిలో ఉన్న, ప్రారంభించాల్సిన అభివృద్ధి పనుల పై ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత గా ఏ ఈల వారీగా కాంట్రాక్టర్ల వారీగా కాంట్రాక్టు తీసుకున్న పనులు పూర్తయిన పనులు, ప్రారంభించాల్సిన పనుల వారీగా సమీక్ష నిర్వహించారు.

## నేడు గుంటూరులో జోస్ ఆలుక్కాస్ షోరూం ప్రారంభం

పాత గుంటూరు: గుంటూరు బ్రాడీపేటలో జోస్ ఆలుక్కాస్ సరికొత్త షోరూం జులై 1న ఉదయం 10.30 గంటలకు ప్రారంభిస్తున్నట్లు జోస్ ఆలుక్కాస్ చైర్మన్ జోస్ ఆలుక్కా శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ శనివారం కొనుగోలు చేసేవారికి ప్రత్యేకతతో పాటు, నేటి నుంచి 5వ తేదీ వరకు రూ. 50 వేల ఆభరణాలను కొనుగోలు చేసే వారికి ఒక బంగారు నాణెం బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. వివాహ కొనుగోళ్లకు ప్రత్యేక తగ్గింపు, షోరూంలో ఎక్స్ఛేంజ్ ఫెస్ట్ జరుగుతుందన్నారు. వజ్రాలపై 20 శాతం తగ్గింపు, ప్లాటినం ఆభరణాలపై 7 శాతం తగ్గింపు పొందవచ్చునన్నారు.

## డాక్టర్ ప్రభావతికి సన్మానం



డాక్టర్ నీలం ప్రభావతిని సన్మానిస్తున్న జీజీహెచ్ వైద్యులు, వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా సుమారు మూడేళ్లపాటు పనిచేసి శుక్రవారం సాయంత్రం పదవీ విరమణ చేసిన డాక్టర్ నీలం ప్రభావతిని పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. డాక్టర్ ప్రభావతి 35 సంవత్సరాలు గైనకాలజిస్టుగా సేవలందించి ఎన్నో కాన్పులు చేసి ఉత్తమ సర్జన్‌గా పలుమార్లు అవార్డులు అందుకున్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి అవార్డులు అందుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా కరోనా సమయంలో ఆమె చేసిన సేవలు గుర్తించి జిల్లా కలెక్టర్ ఉత్తమ అధికారిగా అవార్డును అందజేశారు. రెండుసార్లు కరోనా సోకినప్పటికీ భయపడకుండా రోగుల ఆరోగ్యమే ధ్యేయంగా పనిచేసి అందరి మన్ననలు పొందారు. గుంటూరు ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్, ఆర్ఎంఓ డాక్టర్ సతీష్‌కుమార్, గైనకాలజీ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వరరావు, పలువురు కార్యాలయ ఉద్యోగులు, నర్సింగ్ అధికారులు, సిబ్బంది డాక్టర్ ప్రభావతిని సన్మానించారు.

### ప్రభావతి సేవలు విలువైనవి

గుంటూరు ఎడ్యుకేషన్: జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ప్రభావతి విలువైన సేవలు అందించారని హిందూ ఫార్మసీ కళాశాల ఛైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ నీలం ప్రభావతిని జీజీహెచ్‌లోని ఆమె చాంబర్లో కలిసిన జూపూడి రంగరాజు ఆమెను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక బహుకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ కె. రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ పి.సీతారామయ్య, పరిశోధన విభాగ డైరెక్టర్ డాక్టర్ ఆర్. గోవిందరాజున్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రైతు సేవల్లో అలసత్వం వద్దు

డీఏఓ నున్న వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఏఓ నున్న వెంకటేశ్వర్లు, డీడీఏ రామాంజనేయులు, ఏడీఏ శ్రీనివాసరావు

కొరిటెపాడు (గుంటూరు): రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందించే సేవల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది అలసత్వం వహించ వద్దని, సకాలంలో సేవలు అందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిత్యం రైతులతో ఉంటూ వారికి నాణ్యమైన సేవలు అందించాలన్నారు. స్థానిక కృషీ భవన్‌లో గుంటూరు సబ్ డివిజన్ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులకు (వీఏఏ, వీహెచ్ఏ) ఖరీఫ్ సన్నద్ధతపై శుక్రవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ఆరంభం కావడంతో రైతులకు పంట విత్తనాలు, మట్టి పరీక్షలు, పొలంబడులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇబ్బందులు కలగకుండా విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని, ఎక్కడి నుంచి ఫిర్యాదు వచ్చినా సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు చిరుధాన్యాలు సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. చిరుధాన్యాలైన రాగులు, సజ్జ లు, కొర్రలు వంటి వాటిలో ఏదో ఒక రకాన్ని రైతులు సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో డీడీఏ రామాంజనేయులు, ఏఓ కె.రమణ కుమార్, సబ్ డివిజన్ పరిధిలోని ఏఓలు, ఏఈఓలు, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

## టీడీఆర్ బాండ్ల పంపిణీ



టీడీఆర్ బాండ్లు పంపిణీ చేస్తున్న మేయర్, కార్పొరేటర్లు

నెహ్రూనగర్: నగరంలో రోడ్ల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని, విస్తరణకు సహకరిస్తున్న స్థానికులకు నష్టపరిహారం, టీడీఆర్ బాండ్లను పంపిణీ వెను వెంటనే చేయడం జరుగుతుందని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. శుక్రవారం ఏటీ అగ్రహారం రహదారి విస్తరణలో స్థలాలు కోల్పోయిన వారికి ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ తో కలిసి బాండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గుంటూరు నగరాభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించిందని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి అధికారులు, పాలక వర్గం విశేష కృషి చేస్తోందన్నారు. చుట్టుగుంట నుండి ఏ.టి అగ్రహారం జీరో లైన్ వరకు 1.19 కిలోమీటర్లు 80 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని, విస్తరణకు స్థానికులు పెద్ద ఎత్తున సహకరించారన్నారు. విస్తరణలో ప్రభావితం అవుతున్న 210 నిర్మాణాలకు గాను రూ. 7 కోట్లు నష్టపరిహారం అంచనా వేయగా ఇప్పటికే 4.60 కోట్ల రూపాయలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. టీడీఆర్ బాండ్ల కోసం 72 ఎండార్స్‌మెంట్ ఇవ్వగా రిజిస్టర్ డాక్యుమెంట్స్ ప్రతులు ఇచ్చిన 21 మందికి టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశామన్నారు. త్వరలో డాక్యుమెంట్స్ ఇచ్చిన అందరికీ బాండ్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు అచ్చాల వెంకటరెడ్డి, అడకా పద్మావతి, అందుగుల సంతోష్, షేక్ రోషన్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఏసీపీ అశోక్ కుమార్, డీఈఈ రమేష్ బాబు పాల్గొన్నారు.

## ఎంఈవో–1 పోస్టుల భర్తీ తగదు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎంఈవో–1 పోస్టులను కామన్ సీనియార్టీపై భర్తీ చేయడం తగదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. బసవ లింగారావు తెలిపారు. న్యాయస్థానంలో ఉన్న కేసులు పరిష్కారమయ్యే వరకు నియామక ప్రక్రియ నిలుపుదల చేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఉన్న ఆర్జేడీ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణను కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వ జీవో 154 ప్రకారం కొత్తగా ఇచ్చిన 13 ఎంఈవో పోస్టులను ఏ యాజమాన్యం కింద భర్తీ చేయాలనే స్పష్టత లేదన్నారు. 13 జెడ్పీ డీవైఈవో పోస్టులను డీవైఈవో పోస్టులుగా మార్చారని, డైట్ లెక్చరర్స్ నియామకాలపై సైతం స్పష్టత కొరవడిందన్నారు. ఏడీని కలిసిన వారిలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మొహ్మద్ ఖాలీద్, ఉపాధ్యక్షుడు పి. నాగ శివన్నారాయణ, నాయకులు పి. రమేష్, సత్యనారాయణ మూర్తి, కోటేశ్వరరావు, శ్రీనివాస్ ఉన్నారు.

## సహస్రలో కీహోల్ సర్జరీలు

గుంటూరు మెడికల్: శరీరంలోని కీలు, జాయింట్ లో ఉన్న సమస్యలను కీహోల్ సర్జరీ ద్వారా గుర్తించి సరిచేయవచ్చని సహస్ర ఆర్థో అండ్ న్యూరో సెంటర్ అధినేత డాక్టర్ మామిళ్లపల్లి శివకుమార్ అన్నారు. మోకాలు, భుజం, తుంటి, మోచేయి, మణికట్టు, గిలక వంటి అన్ని కీళ్లలోని సమస్యలను కోత, కుట్లు లేని కీహోల్ సర్జరీ ద్వారా పరిష్కరించవచ్చు అన్నారు. కీహోల్ సర్జరీ వలన అతి తక్కువ సమయం లో నే తిరిగి సాధారణ స్థితికి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. కీ హోల్ సర్జరీ వల్ల రక్తం పోవడం ఉండదని, పెద్ద గాటు ఉండదని, కట్టు ఉండదన్నారు. మోకాలులో లిగమెంట్స్ తెగిపోయిన, మేనిస్కస్ చినిగిన కీహోల్ సర్జరీ ద్వారా వాటిని రిపేర్ చేయవచ్చును. భుజం కండరాలు తెగినా, కండరాలు బిగుసుకుపోయిన, గూడు మళ్ళీ మళ్ళీ జారుతున్నా అతి చిన్న కీహోల్ సర్జరీ తో రిపేర్ చేయడమే కాకుండా అతి త్వరగా మాములు పనులు అన్ని చేసుకునేలాగా చేయవచ్చన్నారు. ఈ కీహోల్ సర్జరీ లేదా ఆర్థ్రోస్కోపీ విధానం, భారతదేశం లో సుమారు గత 15 సంవత్సరాల నుంచి బాగా ప్రాచుర్యంలో ఉందని చెప్పారు. మన రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ఈ విధానాన్ని 2011లో గుంటూరులోని తమ ఆసుపత్రిలో అందుబాటులోకి తెచ్చామన్నారు. గత 12 సంవత్సరాలలో ఆరు వేలకు పైగా కీహోల్ జాయింట్ సర్జరీలు చేసి, నూరు శాతం సక్సెస్ రేట్ సాధించి, ప్రముఖ క్రికెటర్ సునీల్ గవాస్కర్ చేతులమీదుగా గ్లోబల్ హెల్త్ కేర్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నామని వెల్లడించారు. పేదలకు ఆరోగ్యశ్రీ లో ఈ అత్యాధునిక సర్జరీని పూర్తి ఉచితంగా చేస్తున్నామన్నారు.

## వ్యక్తిత్వాన్ని అభివృద్ధి పరచుకోవాలి



పుస్తకాలు అందజేస్తున్న రాధిక, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: వ్యక్తిత్వాన్ని అభివృద్ధి పరచుకోవడం ద్వారా క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన నడవడిక అలవడతాయని స్టెప్-స్వశక్తి మేనేజర్ బి. రాధిక పేర్కొన్నారు. శుక్రవారం మార్కెట్ సెంటర్లోని హిందూ కాలేజీ హైస్కూల్లో టెన్త్ విద్యార్థులకు యువజన సర్వీసుల శాఖ, స్టెప్-స్వశక్తి ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రాధిక మాట్లాడుతూ విద్యార్థులు స్థిరమైన లక్ష్యంతో తమ జీవితాలను చక్కదిద్దుకోవాలని సూచించారు. 10వ తరగతి విద్య తరువాత తల్లిదండ్రుల మార్గదర్శనంలో నడవాలని తెలిపారు. ఈసందర్భంగా వివిధ కోర్సులను గురించి వివరించారు. అనంతం స్టెప్-స్వశక్తి ఆధ్వర్యంలో జిల్లాలో అందుబాటులో ఉన్న కళాశాలలు, వ్యక్తిత్వ వికాసంపై లిటరేచర్ గల బుక్‌లెట్స్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. శ్రీనివాసరావు, స్టెప్-స్వశక్తి సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు, తెలుగు పండిట్ ఆర్‌వీఎస్ఏ శర్మ తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: డాక్టర్స్ డే సందర్భంగా కేర్‌వెల్ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా శుక్రవారం తెలిపారు. స్థానిక గుంటూరువారితోట 7వలైనులోని తమ ఆసుపత్రిలో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతోందన్నారు.

## దాడి కేసులో నిందితులు అరెస్టు

పట్నంబజారు: వ్యక్తిపై దాడిచేసి నగదు దోచుకుపోయిన సంఘటనలో నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుడంపాడు గ్రామానికి చెందిన లక్కాకుల సుబ్బారావు జూన్ 26న కొల్లిశారదా మార్కెట్‌కు వచ్చి కూరగాయలు కొనుగోలు చేసి తిరిగి ఊరు వెళుతున్న సమయంలో శ్రీచైతన్య కాలేజీ వద్ద నలుగురు వ్యక్తులు కారులో నుండి దిగి ఇష్టమొచ్చినట్లు కొట్టి రూ.18 వేలు నగదు లాక్కొని పరారయ్యారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులు నరసరావుపేటకు చెందిన షేక్ సైదావల్లి, నల్లచెరువుకు చెందిన షేక్ గౌస్‌బాషా, షేక్ మొహమ్మద్ ముస్తకిన్, షేక్ మస్తాన్‌వలి నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి రూ. 17,500, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.